రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.33 గం.

సహర్ : శనివారం ఉ: 4:56 గం.



ఆదాయం ఉన్నా.. నియామకాలు సున్నా

- మార్కెట్ కమిటీలకు కార్యదర్శులు కరువు
- ఒక్కో కార్యదర్శికి మూడు మార్కెట్ల బాధ్యతలు
- ఇంకా కార్యదర్శి గ్రేడ్ ఖరారు కానివి కొన్ని..
- మార్కెట్ కమిటీల్లో కోటికి తగ్గని ఆదాయం



కొండపాక వ్యవసాయ మార్కెట్ కమిటీ

గజ్వేల్, మార్చి 21: సిద్దిపేట జిల్లాలో హంగు, ఆర్భాటానికి మార్కెట్ కమిటీలను గత ప్రభుత్వాలు ఏర్పాటు చేశాయి. వాటికి ఆదాయ వనరులు ఉన్నా సరిపడా అధికారులు, సిబ్బందిని నియమించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 14 వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉండగా అన్నింటి ఆదాయం రూ.కోటి పైనే ఉంది. అయినప్పటికీ పూర్తిస్థాయిలో సెక్రటరీల నియామకం చేపట్టకపోవడంతో ఒక్కో మార్కెట్ కార్యదర్శికి రెండు, మూడు మార్కెట్ కమిటీల బాధ్యతలు మీద పడ్డాయి. ఫలితంగా వారు తీవ్రమైన పనిభారం, ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. జిల్లాలో సిద్దిపేట మార్కెట్ కమిటీకి స్పెషల్ గ్రేడ్ సెక్రటరీ ఉండగా, గజ్వేల్, చేర్యాలకు గ్రేడ్-1 సెక్రటరీలు, హుస్నాబాద్‌కు గ్రేడ్-2 సెక్రటరీ, వంటిమామిడి, దుబ్బాక, తొగుట, దౌల్తాబాద్‌కు అసిస్టెంట్ సెక్రటరీల స్థాయిని ఖరారు చేయగా, మిగిలిన చిన్నకోడూరు, నంగునూరు, కొండపాక, బెజ్జంకి, కోహెడ, మిరుదొడ్డి మార్కెట్ కమిటీలకు ఇప్పటివరకు కనీసం గ్రేడ్‌ను ఖరారు చేయలేదు. దీంతో మార్కెట్ కమిటీల్లో పాలన గాలికి వదిలినట్లు అయింది.

రూ.కోటికి తగ్గని ఆదాయం

జిల్లాలోని తొగుట మార్కెట్ కమిటీ మినహా అన్ని మార్కెట్ కమిటీల్లో ఆదాయం రూ.కోటిపైనే ఉంది. జిల్లాలోని మార్కెట్ కమిటీల ఆదాయం పరంగా చూస్తే సిద్దిపేట రూ.3.94 కోట్లు, గజ్వేల్ రూ.4.80కోట్లు, హుస్నాబాద్ రూ.4.57 కోట్లు, చేర్యాల రూ.3.98 కోట్లు, వంటిమామిడి రూ.2.57 కోట్లు, బెజ్జంకి రూ.2.25కోట్లు, కోహెడ రూ.1.96కోట్లు, కొండపాక రూ.1.88 కోట్లు, దుబ్బాక రూ.1.85 కోట్లు, చిన్నకోడూరు రూ.1.72కోట్లు, నంగునూరు రూ.1.33కోట్లు, దౌల్తాబాద్ రూ.1.51కోట్లు, మిరుదొడ్డి రూ.1.16కోట్లు, తొగుట రూ.81.75 లక్షలు ఆదాయం సమకూరుతుంది. ఈ యేడు సైతం రూ.34.39కోట్లు జిల్లా లక్ష్యంగా ఉంటే ఇప్పటివరకు రూ.25.44 కోట్లు వసూలు చేశారు. కానీ సరిపడా కార్యదర్శులను నియమించడంలో మాత్రం ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి.

అదనపు బాధ్యతలు

సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ బి.వెంకటయ్య సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌తో పాటు నంగునూరు, బెజ్జంకి, హుస్నాబాద్ బాధ్యతలను అదనంగా నిర్వహిస్తున్నారు. చేర్యాల మార్కెట్ కమిటీ సెక్రటరీ గ్యాదరి పరమేశ్వర్ చేర్యాలతో పాటు చిన్నకోడూరు, కోహెడ, కొండపాక మార్కెట్ కమిటీ బాధ్యతలను చూస్తున్నారు. గజ్వేల్ మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్‌వెస్లీ గజ్వేల్‌తో పాటు మిరుదొడ్డి, తూప్రాన్ మార్కెట్ కమిటీ సెక్రటరీ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. వంటిమామిడి మార్కెట్ కార్యదర్శిగా బాధ్యతలను నిర్వహిస్తున్న రేవంత్ షాద్‌నగర్ అసిస్టెంట్ సెక్రటరీగా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. దౌల్తాబాద్‌కు అసిస్టెంట్ సెక్రటరీ స్థాయి అధికారి సుగ్రీవ్, తొగుటకు స్వామి, దుబ్బాక సురేశ్‌కుమార్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో నూతన ప్రభుత్వమైనా పూర్తిస్థాయి అధికారులను నియమిస్తుందో లేదో వేచి చూడాల్సిందే.

'టైంపాస్' టీం
ట్రాన్స్‌ఫర్

- 'వెల్‌నెస్‌లో టైంపాస్' కథనానికి స్పందన
- సిద్దిపేటలో ముగ్గురు ఉద్యోగుల బదిలీ
- ఉత్తర్వులు జారీ చేసిన ఆరోగ్య శ్రీ ట్రస్టు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సిద్దిపేట టౌన్, మార్చి21 : సిద్దిపేటలోని వెల్‌నెస్ సెంటర్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులకు సేవలందించాల్సిన ఉద్యోగుల్లో కొందరు కంప్యూటర్లలో, మొబైళ్లలో దర్జాగా సినిమాలు చూస్తూ, గేమ్‌లు ఆడుతూ కాలక్షేపం చేస్తున్న వైనంపై ఈనెల 6న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ఆరోగ్య ట్రస్టు అధికారులు స్పందించారు. టైంపాస్ చేసిన ముగ్గురు ఉద్యోగులను గుర్తించి ఇద్దరిని సంగారెడ్డికి, ఒకరిని కూకట్‌పల్లి సెంటర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులను జారీచేశారు.


వెల్‌నెస్‌లో టైంపాస్

ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం

మల్లన్నగుట్ట ఘటనలో
ఇరువర్గాలపై కేసు

దుబ్బాక, మార్చి 21 : దుబ్బాక మండలం రేకులకుంట మల్లికార్జున ఆలయం (మల్లన్నగుట్ట)లో బుధవారం జరిగిన ఘర్షణలో ఇరువర్గాలపై గురువారం కేసు నమోదు చేసినట్లు దుబ్బాక ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. ఆలయంలో ఇటీవల కమ్మర్‌పల్లికి చెందిన పదిమంది పయ్యావుల వర్గానికి చెందిన వారికి పూజలు చేయడానికి అనుమతినిస్తూ దేవాదాయశాఖ గుర్తింపు కార్డులను జారీ చేసింది. దీనికి అభ్యంతరం తెలుపుతూ.. మల్లాయపల్లికి చెందిన చెరుకూరి వర్గం, రేకులకుంటకు చెందిన కోటిపూజారులు అడ్డుకున్నారు. 20 ఏళ్ల నుంచి నుంచి పయ్యావుల వర్గం మల్లన్నగుట్టలో పూజలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ వచ్చారు. కొత్తగా గుర్తింపుకార్డుల జారీతో వివాదం నెలకొన్నది. ఈ క్రమంలో ఆలయం వద్దకు వచ్చిన పయ్యావులవర్గాన్ని అడ్డుకుని చెరుకూరి, కోటి పూజారులు దాడి చేశారు. ప్రతిదాడిగా చెరుకూరి, కోటి పూజారులపై పయ్యావుల వర్గం వారు దాడి చేశారు. ఈ దాడుల్లో పలువురు తీవ్రంగా పడ్డారని, ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గంగరాజు తెలిపారు. ఆలయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పటిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

కోడ్ ఉల్లంఘన జరగకూడదు

- అన్ని బృందాలు పకడ్బందీగా పనిచేయాలి
- సరైన పత్రాలు చూపించకపోతే నగదు సీజ్
- కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మను చౌదరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 21 : రాష్ట్ర శాసనసభ ఎన్నికల మాదిరిగానే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా, ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా అన్ని నిఘా బృందాలు పకడ్బందీగా విధులు నిర్వర్తించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనుచౌదరి అధికారులను ఆదేశించారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో కలెక్టర్ ఆధ్వర్యంలో ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, ఎంసీసీ, ఎక్స్పెండిచర్ అబ్జర్వేషన్ బృందాలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిఘా బృందాల పనితీరుపై ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని సూచించారు. ఎన్నికల నిబంధనల మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్లే వారు సరైన పత్రాలు చూపించకపోతే సీజ్ చేయాలన్నారు. సీజ్ చేసిన నగదుకు సరైన పత్రాలను చూపించి తీసుకెళ్లేందుకు కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి కమిటీ వివరాల పోస్టర్లను ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచాలని చెప్పారు. సీజ్ చేసిన నగదు రూ.10లక్షల లోపు ఉంటే జిల్లా ట్రెజరీ కార్యాలయంలో అందజేయాలని, రూ.10 లక్షలు దాటితే ఇన్‌కంటాక్స్ నోడల్ ఆఫీసర్‌కు అందజేయాలని ఆయన సూచించారు. ఎలక్షన్ కోడ్‌ను అనుసరించి ప్రభుత్వ, పబ్లిక్, ప్రైవేట్ స్థలాల్లో ఏర్పాటు చేసిన అన్ని రకాల ప్రచారం హోర్డింగులు ఫ్లెక్సీలు పోస్టర్లు వాల్ పేపర్లను తొలగించాలని స్పష్టం చేశారు. ఇక సీ-విజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు

జిల్లాలో నాలుగు నియోజకవర్గాల పరిధిలో ఎనిమిది చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు నిరంతరాయంగా చేపడుతున్నామని సీపీ అనురాధ తెలిపారు.

అన్ని నిఘా బృందాల పనితీరును కంట్రోల్ రూమ్ నుండి పరిశీలిస్తామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. మతపరమైన, ప్రార్థనా మందిరాల వద్ద, స్థలాల వద్ద ఎలాంటి ప్రచారాలు నిర్వహించకూడదన్నారు. అనంతరం ఎఫ్‌ఎస్‌టీ, ఎస్‌ఎస్‌టీ, ఎంసీసీ నిర్వహించాల్సిన విధులను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు కలెక్టర్, దుబ్బాక ఏఆర్వో గరిమా అగ్రవాల్, అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, డీఆర్వో నాగరాజమ్మ, సిద్దిపేట, హుస్నాబాద్ ఏఆర్వోలు సదానందం, రామ్మూర్తి, ఏసీపీలు మధు, సతీష్, పురుషోత్తం రెడ్డి, పోలీస్ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్ అయోధ్యరెడ్డి, ఆయా ఎన్నికల బృందాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..
వేచరేణివాసులకు శాపం

- నిధులున్నా నిర్మాణానికి నోచుకోని కాజ్‌వే
- కోతకు గురైన చెక్ డ్యాం మత్తడి ఆవరణ
- నిర్మాణానికి పూర్తయిన అగ్రిమెంట్ గడువు



నడుము లోతు వరదనీటిలోనుంచి పాడె మోసుకెళ్తున్న గ్రామస్థులు (ఫైల్)

చేర్యాల, మార్చి 21 : కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. పంచాయతీరాజ్‌శాఖాధికారుల పట్టింపు లేని తనం చేర్యాల మండలం వేచరేణి గ్రామస్థుల పాలిట శాపంగా మారింది. గ్రామ శివారులో వాగు వద్ద కాజ్‌వే నిర్మాణానికి నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ పనులు చేపట్టలేదు. టెండర్ అగ్రిమెంట్ గడువు ముగిసినా అధికారులు ప్రత్యామ్నాయచర్యలు తీసుకోకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోయి, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

చేర్యాల మండలం వేచరేణి గ్రామశివారులోని వాగుపై ఎన్నో ఏళ్ల చెక్‌డ్యాంను నిర్మించారు. ఈ చెక్‌డ్యాం పైనుంచే అవతలివైపు ఉన్న పొలాలతో పాటు కొమురవెల్లి, చేర్యాలకు చెందిన రైతులు, గ్రామస్థులు రాకపోకలు సాగిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం వర్షాకాలంలో చెక్‌డ్యాం కోతకు గురై మత్తడి సమీపంలో పూర్తిగా దెబ్బతినడంతో తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు వాగు పొంగి ప్రవహించడంతో పూర్తిగా దెబ్బతిని దారి కొట్టుకుపోయింది. ఇక్కడ కాజ్‌వే మంజూరైనా పనులు మాత్రం ప్రారంభంకాలేదు.



నడవటానికి వీలులేకుండా దెబ్బతిన్న చెక్‌డ్యాం ఆవరణ

వాగు అవతలే వైకుంఠధామం

వాగు అవతలి వైపు ఉన్న ప్రభుత్వ భూమిలోనే గ్రామ వైకుంఠధామం, వననర్సరీని ఏర్పాటు చేశారు. చెక్‌డ్యాం పూర్తిగా దెబ్బతినడంతో వర్షాకాలంలో నడుములోతు వరదనీటిలో చెక్‌డ్యాం అంచువెంబడి మృతదేహాన్ని మోసుకెళ్తూ అంత్యక్రియలు జరుపుతున్నారు. ఏమాత్రం అజాగ్రత్త వహించినా నీటిలో కొట్టుకుపోయే ప్రమాదముంది.

కాజ్‌వే నిర్మాణానికి నిరసన దీక్షలు

వేచరేణి వాగు వద్ద కాజ్‌వే నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.94 కోట్లు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. దీంతో గ్రామస్థులు కాంట్రాక్టర్, పంచాయత్‌రాజ్‌శాఖ అధికారుల తీరుపై మండి పడుతున్నారు. కొన్ని రోజుల క్రితం వాగు వద్ద నిరసనదీక్ష చేపట్టినా ఫలితం లేకుండా పోయింది.

నిర్లక్ష్యం తగదు

నిత్యం ఈదారి వెంబడి చేర్యాల, కొమురవెల్లి మండల కేంద్రాలకు వెళ్తుంటారు. దారి కోతకు గురవడంతో రాకపోకలు నిలిచి ఇబ్బందులుపడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మరమ్మతులు చేపట్టి దారిని పునరుద్ధరించడంతో పాటు శాశ్వత ప్రాతిపదికన సమస్య పరిష్కారానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

- తౌట బాలరాజు, వేచరేణి

కాంట్రాక్టర్‌కు ఇచ్చిన నోటీసులు వెనక్కి వచ్చాయి

కాజ్‌వే నిర్మాణానికి సంబంధించి కేఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ టెండర్ దక్కించుకుంది. అగ్రిమెంట్ గడువు కూడా ముగిసింది. కానీ పనులు చేపట్టని విషయమై ఎన్నిసార్లు కాల్ చేసినా లిఫ్ట్ చేయడం లేదు. నోటీసులు పంపిస్తే రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా తిరిగి మాకే వాపసు వచ్చాయి. టర్మినేషన్ కోసం లెటర్ పంపించాం. ఎస్ఈ ఆదేశానుసారం చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్ డీఈ



కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని వాగు వద్ద నిరసన దీక్ష చేపట్టిన గ్రామస్థులు

నివాసాలు అటు.. భూములు ఇటు

- కాలగర్భంలో కలిసి.. కాగితాల్లో నిలిచిన శివరాంపూర్
- కొత్త మండలం ఏర్పాటులో మరిచిపోయిన గ్రామం
- రైతులకు తప్పని అవస్థలు

దుబ్బాక, మార్చి 21: కాలగర్భంలో కలిసిన గ్రామం కాగితాల్లో భద్రంగా ఉంది. చూద్దామంటే శిథిల ఆనవాళ్లు కూడా కనిపించని గ్రామం రికార్డుల్లో మాత్రం చెక్కుచెదరలేదు. రహదారులుండి నివాసాలు లేని ఆ గ్రామమే దుబ్బాక మండల పరిధిలోని శివరాంపూర్. నిజాం కాలం నుంచి శివరాంపూర్ రెవెన్యూ గ్రామంగా రికార్డుల్లో ఉంది. జనమే లేని ఈ గ్రామం.. ఇక్కడి భూములను నమ్ముకున్న రైతాంగానికి చిక్కులను తెచ్చిపెట్టింది. నివాసం ఉండే గ్రామాలను కొత్త మండలంలోకి చేర్చి, సాగుభూములున్న శివరాంపూర్ గ్రామాన్ని పాత మండలంలోనే వదిలేయడంతో రైతులకు అవస్థలు తప్పడం లేదు.

72 మంది రైతులకు జీవనాధారం

పాత దుబ్బాక మండలం ఎనగుర్తి- బొప్పాపూర్ గ్రామాల మధ్య సుమారు 158 ఎకరాల విస్తీర్ణంతో శివరాంపూర్ అనే గ్రామం రికార్డుల్లో కొనసాగుతుంది. ఆ గ్రామంలో మొత్తం 37 సర్వే నంబర్లలో ఉన్న భూమిని 72 మంది రైతులు సాగుచేస్తూ జీవిస్తున్నారు. ఈ గ్రామానికి సుమారు 23 ఎకరాల రహదారి కూడా ఉంది. అయితే, గతేడాది దుబ్బాక మండలంలోని బొప్పాపూర్, ఎనగుర్తి, చిట్టాపూర్, పోతరెడ్డిపేట, రామేశ్వరంపల్లి, నగరం, తాళ్లపల్లి, చౌదర్‌పల్లి గ్రామాలను కలిపి అక్బర్‌పేట - భూంపల్లి మండలాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతికంగా రెవెన్యూ గ్రామాలను ఈ మండలంలో విలీనం చేస్తున్నట్టుగా ఆదేశాలిచ్చారు. అయితే, శివరాంపూర్ గ్రామాన్ని మాత్రం ఈ మండలంలో చేర్చడం మరిచారు. ఎనగుర్తితోపాటు బొప్పాపూర్ గ్రామాల మధ్య కూడవెల్లి వాగును ఆనుకుని ఉన్న శివరాంపూర్ పూర్తిగా భూంపల్లి- అక్బర్‌పేట మండలానికి అనువైన దూరంలో ఉంటుంది. ప్రజాప్రతినిధులు కూడా నూతన మండలంలో శివరాంపూర్‌ను చేర్చడం మరిచిపోయారు. నివాసం ఉంటున్న గ్రామాలు అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోకి, సాగు భూములు దుబ్బాక మండలంలోకి చేరడంతో రైతులకు అవస్థలు తప్పడంలేదు.

రోగాలు ప్రబలడంతో ఊరంతా ఖాళీ

నాలుగు దశాబ్దాల క్రితం ఎంతో వైభవంగా వెలిగిన శివరాంపూర్‌గ్రామంలో రోగాలు ప్రబలడంతో ప్రజలంతా వలస వెళ్లారు. గ్రామాన్ని ఖాళీచేసి సమీపంలోని బొప్పాపూర్, ఎనగుర్తికి తరలిపోయారు. కూడవెల్లి వాగు తరచూ పొంగడంతో ఆగ్రామం పూర్తిగా కొట్టుకుని పోయింది. గ్రామంలో ఆనాటి ఇళ్ల ఆనవాళ్లు కూడా లేకుండాపోయాయి. కాగితాలలో ఉన్న శివరాంపూర్ పేరుతోనే పట్టాపాస్ పుస్తకాలను ప్రభుత్వం రైతాంగానికి అందజేసింది. అధికారులు కూడా శివరాంపూర్‌ను జనంలేని గ్రామంగానే గుర్తించారు. సాంకేతికంగా అన్ని పాస్‌పుస్తకాలు, రికార్డులు మాత్రం శివరాంపూర్ పేరుతోనే సాగుతున్నాయి.



శివరాంపూర్‌లో వెలిసిన హనుమాన్ ఆలయం



గ్రామ ఆనవాళ్లు

అక్బర్‌పేట- భూంపల్లి మండలంలో చేర్చాలి

ఎనగుర్తి, బొప్పాపూర్‌లో నివాసం ఉంటున్న రైతుల వ్యవసాయ భూములు దుబ్బాక మండలంలోనే కొనసాగడం వారికి తలనొప్పిగా మారింది. అక్బర్‌పేట- భూంపల్లి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న శివరాంపూర్‌ను అందులో చేర్చకపోవడంతో చుట్టూ తిరిగి దుబ్బాక రెవెన్యూ కార్యాలయానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నది. శివరాంపూర్‌ను అక్బర్‌పేట - భూంపల్లి మండలంలో చేర్చాలని రైతులు కోరుతున్నారు.



శివరాంపూర్ గ్రామస్థులు కొలిచే పోచమ్మ ఆలయం



పంటసాగుగా మారిన గ్రామం

రైతును బలిగొన్న విద్యుత్ కంచె

- కంచె ఏర్పాటు చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన రైతుకు దేహశుద్ధి
- సంగారెడ్డి జిల్లా కల్హేర్ కొత్తచెరువు తండాలో ఉద్రిక్తత

7లో..

వ్యవసాయ అనుబంధ రంగాలకు
రూ.178 కోట్ల రుణాలు

- నా బార్డు ఉమ్మడి మెదక్ జిల్లా డీడీఎం సెసిల్ తిమెతి

పుల్కల్‌లో ‘పది’ ఆంగ్ల పరీక్ష ప్రశాంతం

పుల్‌కల్, మార్చి 21: ఉమ్మడి పుల్కల్ మండలంలో పదో తరగతి ఆంగ్ల పరీక్ష మూడోరోజు ప్రశాంతంగా జరిగింది. తెలంగాణ ఆదర్శ పాఠశాల, గురుకుల పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాలను గురువారం మండల విద్యా శాఖాధికారి దండు అంజయ్య ఆకస్మికంగా సందర్శించారు. గురుకుల పాఠశాల పరీక్షా కేంద్రంలో 189 మంది విద్యార్థులకు 189 మంది హాజరవగా వందశాతం పరీక్షా రాశారని తెలిపారు. ఆదర్శ పాఠశాలలో 184 మంది విద్యార్థులకుగాను 183 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా, ఒకరు గైర్హాజరయ్యారు. పెద్దారెడ్డిపేట జిల్లా పరిషతు ఉన్నత పాఠశాలకు చెందిన ఓ బాలిక అనారోగ్యం కారణంగా పరీక్షకు హాజరుకాలేదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, బాలికతో మాట్లాడి ముందు వచ్చే నాలుగు పరీక్షలు రాయిస్తామన్నారు.

రంగోత్సవంలో విద్యార్థులకు అవార్డుల పంట

కల్హేర్/సిర్గాపూర్, మార్చి 21: సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు అంతర్జాతీయ రంగోత్సవం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ పాండు గురువారం తెలిపారు. గతనెలలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఈపోటీల్లో పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పదో తరగతి విద్యార్థి పి.అర్జున్ అంతర్జాతీయ స్థాయిలో రెండో బహుమతి సాధించి ప్రఖ్యాత ఎంఎఫ్ హుస్సేన్ అవార్డు పొందాడు. మిగిలిన 13 మంది విద్యార్థుల్లో నలుగురికి అంతర్జాతీయ మెరిట్ అవార్డులు, ఐదుగురికి గోల్డ్‌మెడల్స్, నలుగురికి కన్సోలేషన్ బహుమతులు వచ్చాయి. విద్యార్థులను ప్రోత్సహించిన టీచర్ మణివర్మ, ప్రిన్సిపల్ పాండులకు ట్రోఫీ, మోటివేషన్ సర్టిఫికెట్‌ను నిర్వాహకులు అందజేసినట్లు ప్రిన్సిపల్ పాండు తెలిపారు.

వంతెనలు సరే.. అప్రోచ్ రోడ్డు నిర్మాణలేవీ?

- మంజీరా నదిపై రెండుచోట్లా బ్రిడ్జిల నిర్మాణం
- ఒకవైపు రోడ్డు వేసి, మరోవైపు మరిచిన వైనం
- దూరభారంతో ఇబ్బందుల్లో ప్రయాణికులు
- పాపన్నపేట మండలం రామతీర్థం వైపు అప్రోచ్ రోడ్డు నిర్మిస్తే రెండు ఉమ్మడి జిల్లావాసులకు మేలు

పాపన్నపేట, మార్చి 21: మెదక్ జిల్లా పాపన్నపేట మండలం రామతీర్థం, కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామాల శివారు నుంచి ప్రవహిస్తున్న మంజీరానదిపై 2017లో అప్పటి ప్రభుత్వం రూ.18 కోట్లతో వంతెనను నిర్మించింది. పాపన్నపేట మండలమే కాకుండా టేక్మాల్, జోగిపేట, సంగారెడ్డి, పటాన్‌చెరు, హైదరాబాద్ పరిసర మండలాలకు, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలకు ఈ వంతెన నిర్మాణంతో దూరభారం తగ్గుతుందని బీఆర్ఎస్ ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టింది. ఈ మేరకు వెంకంపల్లి వైపు తాండూరు గేటు వరకు 5.75కిలో మీటర్ల వరకు తారు రోడ్డును నిర్మించారు. పాపన్నపేట మండలం రామతీర్థం వైపు 4 కిలో మీటర్ల అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టక పోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. వంతెన నుంచి పాపన్నపేట వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు పంపినా గత ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. దీంతో రెండు జిల్లాల సరిహద్దు ప్రజలు ఇబ్బందులు పడుతూ ప్రయాణం సాగిస్తున్నారు. అప్పట్లో ఎల్లారెడ్డి, మెదక్ ఎమ్మెల్యేల మధ్య పొరపొచ్చాల వల్లే అప్రోచ్ రోడ్డు నిర్మాణం జరగలేదన్న విమర్శలొస్తున్నాయి.


జోగిపేట: అల్మాయిపేట వైపు ధ్వంసమైన మట్టిరోడ్డు


పాపన్నపేట: మంజీరా నదిపై పూర్తయిన వంతెన

అదనంగా కిలోమీటర్ల మేర ప్రయాణం

వంతెనకు ఒకవైపు అప్రోచ్ రోడ్డు లేకపోవడంతో పాపన్నపేట మండల ప్రజలు కామరెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలానికి వెళ్లేందుకు మెదక్, ఎల్లారెడ్డి మీదుగా 40కిలో మీటర్ల దూరం ప్రయాణించాలి. ఎల్లారెడ్డికి వెళ్లాలంటే మెదక్ పట్టణం మీదుగా 70 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. పాపన్నపేట మండలం రామతీర్థం వైపు అప్రోచ్ రోడ్డు పూర్తయితే కేవలం 22కిలో మీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల ప్రజలు సంగారెడ్డికి వెళ్లడానికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు వెళ్లడానికి దూర భారం తగ్గడమే కాకుండా సమయం కూడా ఆదా అవుతుంది.


జోగిపేట: 2012లో నిర్మించిన వంతెన

అల్మాయిపేట వైపు నిర్మిస్తే ప్రజలకు మేలు

జోగిపేట, మార్చి 21: కోట్లాది రూపాయలు వెచ్చించి వంతనెను నిర్మించినా అప్రోచ్ రోడ్డును నిర్మించకపోవడంతో నిరుపయోగంగా మారింది. అందోలు మండలంలోని అల్మాయిపేట శివారు, హత్నూర మండలం కొన్యాల శివారులోని మంజీర నదిపై రూ.11.16 కోట్లతో వంతెనను నిర్మించి, 2012లో అప్పటి మంత్రి సునీతారెడ్డి ప్రారంభించారు. అనంతరం హత్నూర మండలంలోని కొన్యాల నుంచి వంతెన వరకు తారు రోడ్డును నిర్మించి, అందోలు మండలంలోని అల్మాయిపేట వైపు నిర్మించకుండా వదిలేయడంతో మట్టిరోడ్డే మిగిలింది. దీంతో చిన్నపాటి వర్షానికే ఈ రోడ్డు బురదమయమై వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నది. ప్రస్తుతం ఆ రోడ్డు ధ్వంసమై, మోకాలి లోతు గుంతలతో ఉన్నది. అల్మాయిపేటకు 4 కిలోమీటర్లు, చౌటకూరు వైపు 2 కిలోమీటర్ల దూరం ఉంటుంది. 6 కిలోమీటర్ల మేర ఉన్న ఫార్మేషన్ రోడ్డును తారు రోడ్డుగా మారిస్తే అందోలు, నర్సాపూర్ నియోజకవర్గాల ప్రజలకు ఎంతోమేలు జరుగుతుంది. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ సమస్యపై దృష్టిసారించి బీటీ రోడ్డుగా మార్చాలని ఇరు నియోజకవర్గాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

రైతును బలిగొన్న విద్యుత్ కంచె

- పంట రక్షణకు కంచె ఏర్పాటు చేసి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన రైతుకు దేహశుద్ధి
- సంగారెడ్డి జిల్లా కల్హేర్ కొత్తచెరువు తండాలో ఉద్రిక్తత



విద్యుత్ కంచె తగిలి మృతిచెందిన ధరావత్ రాంసింగ్


కల్హేర్, మార్చి 21: అడవి పందుల బారి నుంచి జొన్న పంటను కాపాడుకోవడానికి కౌలు రైతు ఏర్పాటు చేసిన విద్యుత్ కంచె తగిలి ఓ యువరైతు మృతిచెందగా మృతుడి కుటుంబీకులు కౌలు రైతును చితకబాదిన సంఘటన సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలంలో గురువారం చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పోమ్యానాయక్ తండాకు చెందిన ధరావత్ రాంసింగ్(38) కల్హేర్‌కు చెందిన కస్స పెంటయ్యకు చెందిన భూమిని కౌలుకు తీసుకోగా అందులో జొన్న పంటను వేశారు. ఆయన పక్కనే దేవసోత్ శరవణ్ అందె నాగయ్యకు చెందిన భూమిని కౌలుకు తీసుకుని జొన్న పంటను వేశాడు. ఈ పంటను అడవి పందుల బారి నుంచి కాపాడుకోవడానికి విద్యుత్ తీగలతో కంచె ఏర్పాటు చేశాడు. ప్రతిరోజు రాత్రి కంచెకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి, మరుసటి రోజు ఉదయం తీసేవాడు. అలాగే బుధవారం రాత్రి కంచెకు కనెక్షన్ ఇచ్చిన శరవణ్ తెల్లవారి సరఫరా నిలిపివేయలేదు. అయితే, తన పంటకు నీరు పెట్టేందుకు గురువారం ఉదయం పొలానికి వెళ్లిన ధరావత్ రాంసింగ్ దీనిని గమనించ లేదు. కంచెకు తగిలి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. కంచెకు విద్యుత్ సరఫరా ఇచ్చి ఉదయం 8 గంటలైనా నిర్లక్ష్యంగా కల్హేర్‌లోనే ఉన్న శరవణ్‌ను సంఘటనా స్థలానికి తీసుకొస్తుండగా పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో ధరావత్ రాంసింగ్ బంధువులు దేవసోత్ శరవణ్‌కు దేహశుద్ధి చేశారు. అడ్డువచ్చిన మరో ఇద్దరిని కూడా కొట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న కల్హేర్ ఎస్ఐ వెంకటేశం, ఏఎస్ఐ అంజయ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. మృతుడి బంధువులు, తండావాసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. బలవంతంగా పోలీసులు అక్కడి నుంచి రాంసింగ్ మృతదేహాన్ని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించారు. రాంసింగ్ భార్య ఫిర్యాదు మేరకు కల్హేర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హసన్‌మీరాపూర్‌లో విద్యార్థి ఆత్మహత్య

దుబ్బాక, మార్చి 21: దుబ్బాక మండలం హసన్‌మీరాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన బాల్తే కనకయ్య, తల్లి దేవవ్వ దంపతులు గొర్రెకాపరులుగా జీవనోపాధి పొందుతున్నారు. వీరికి కూతురు అర్చన(20), కుమారుడు అమర్(18) ఉన్నారు. కుమారుడు గతేడాది ఇంటర్‌లో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. ఈసారి తిరిగి పరీక్షలు రాశాడు. కాగా గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉన్నది.

అనుమానాస్పద స్థితిలో ఇద్దరి మృతి


వివరాలు సేకరిస్తున్న పోలీసులు


కుమార్(ఫైల్)

వెల్దుర్తి, మార్చి 21: అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతిచెందిన సంఘటన వెల్దుర్తి మండలం రామాయిపల్లి, టేక్మాల్ మండలం తంపులూరు గ్రామాల్లో చోటు చేసుకున్నది. వెల్దుర్తి మండలం రామాయిపల్లి గ్రామానికి చెందిన అరిగే కుమార్(42) తల్లి పోచమ్మతో కలిసి నివాసముంటున్నాడు. భార్య భూలక్ష్మి, కుమారుడు, కుమార్తె జిన్నారంలో ఉంటున్నారు. మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన కుమార్ బుధవారం వరకు ఇంటికి రాలేదు. అయితే గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ పొలం వద్ద ఉన్న ఓ గుడిసెలో శవమై కనిపించాడు. కుమార్ మృతిపై కుటుంబసభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో గురువారం ఉదయం మెదక్ నుంచి వచ్చిన డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలు ఆధారాలు సేకరించారు. మృతుడి సోదరుడు అరిగే శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవత తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

తంపులూరు గ్రామంలో..


సంగమ్మ(ఫైల్)

టేక్మాల్, మార్చి 21: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. టేక్మాల్ మండలం తంపులూర్ గ్రామానికి చెందిన దుబ్బగల్ల సంగమ్మ(44) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఆరునెలల క్రితం భర్త మృతిచెందాడు. కుమారుడు హైదరాబాద్‌లో జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి యథావిధిగా ఇంట్లో పడుకున్నది. అయితే ఇంటికి తాళం వేసి ఉండడంతో గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేస్తూ కుమారుడికి సమాచారమందించారు. కుమారుడి సూచన మేరకు తాళం పగులగొట్టి చూడగా సంగమ్మ విగత జీవిగా పడి ఉన్నది. దాంతో కుమారుడికి, పోలీసులకు సమాచారం అందజేయగా తంపులూరు వచ్చారు. శరీరంపై గాయాలు ఉండడంతో హత్యచేసినట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డి తెలిపారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్‌లతో విచారణ చేపట్టారు.

వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.178 కోట్ల రుణాలు

- ఉమ్మడి జిల్లాలో మూడు వాటర్ షెడ్, 46 ఎఫ్‌పీవో, మరికొన్ని ప్రాజెక్టులు
- 26 ఫ్యాక్స్‌ల ద్వారా 48 గోడౌన్ల నిర్మాణం
- ఎస్‌హెచ్‌జీ మహిళలకు స్వయం ఉపాధిపై శిక్షణ
- వ్యవసాయరంగంపై ఆసక్తి పెరిగేలా యువతకు శిక్షణ
- 'ఆంధ్రజ్యోతి'తో నాబార్డ్ ఉమ్మడి జిల్లా డీడీఎం సెసిల్‌తిమెతి


నాబార్డ్ డీడీఎం సెసిల్‌తిమెతి

గజ్వేల్‌టౌన్, మార్చి 21: నాబార్డ్ ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.178 కోట్ల రుణాలు అందిస్తున్నట్లు నాబార్డ్ ఉమ్మడి జిల్లా అభివృద్ధి మేనేజర్(డీడీఎం) సెసిల్‌తిమెతి పేర్కొన్నారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లాలో అగ్రి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(ఏఐఎఫ్) ద్వారా ఉమ్మడి జిల్లాలో గోడౌన్స్ కోల్డ్ స్టోరేజీ తదితర నిర్మాణాలు చేపట్టామన్నారు. అలాగే ఉమ్మడి జిల్లాలో 3 వాటర్‌షెడ్ ప్రాజెక్టులు కొనసాగుతుండగా, ఇటీవల 2 పూర్తయ్యాయన్నారు. జగదేవ్‌పూర్ మండలం మాందాపూర్ పరిధిలో 2 వాటర్‌షెడ్ ప్రాజెక్టులు చేపట్టగా ఏడు గ్రామాలకు లబ్ధి చేకూరనున్నదని పేర్కొన్నారు. ఈ వాటర్‌షెడ్లను ఆ గ్రామస్థులకు అప్పగించామని తెలిపారు. అలాగే సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో మరో వాటర్‌షెడ్ ప్రాజెక్టు పనులు నడుస్తున్నాయన్నారు. 46 రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటుచేసి వాటి ద్వారా రైతులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని సెసిల్ తిమెతి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 5 క్లైమేట్ ప్రూఫ్ ప్రాజెక్టులు చేపట్టామని, సంగారెడ్డి జిల్లాలో మూడు, సిద్దిపేట జిల్లాలో రెండు నడుస్తున్నాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని 26 కోఆపరేటివ్ సొసైటీల ద్వారా 48 ప్రాజెక్టులను మంజూరు చేశామని, వీటిద్వారా గోడౌన్ నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్, వేవ్ బ్రిడ్జి తదితర నిర్మాణ పనులు చేపడుతున్నామని వివరించారు. నాబార్డ్ ద్వారా స్వయం ఉపాధి సంఘాలకు (ఎస్‌హెచ్‌జీ) స్వయం ఉపాధిపై శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. మగ్గం వర్క్, జ్యూట్‌బ్యాగ్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్, టైలరింగ్ తదితర రంగాల్లో శిక్షణ ఇవ్వడంతో పాటు మిషనరీ, మెటీరియల్స్‌ను కూడా అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా వ్యవసాయ రంగం నుంచి యువత దూరం కాకుండా, యువకులు ఆకర్షితులయ్యేలా అగ్రికల్చర్ వ్యవసాయంపై శిక్షణ ఇస్తున్నామన్నారు. అలాగే ఆటోమెకానిక్, సెమీ నర్సింగ్ శిక్షణలు నిర్వహిస్తున్నామని నాబార్డ్ డీడీఎం సెసిల్ తిమెతి తెలిపారు.

శాస్త్ర సాంకేతిక పరిశోధనలో ఐఐటీల ముందంజ

- ఘనంగా హైదరాబాద్ ఐఐటీ వ్యవస్థాపక దినోత్సవం

పటాన్‌చెరు, మార్చి 21: శాస్త్ర సాంకేతిక పరిశోధనా పత్రాలను ప్రచురించడంలో మన దేశం ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక శాఖ సెక్రెటరీ ప్రొఫెసర్ అభయ్ కరాండికర్ అన్నారు. హైదరాబాద్ ఐఐటీ 16వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మట్లాడారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో ప్రపంచ శ్రేణి నాణ్యమైన బోధన చేయడమే కాకుండా విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం పెంచడమే ఐఐటీల లక్ష్యమన్నారు. దశాబ్ద కాలంలో మెరుగైన పరిశోధనలు జరుగుతున్నాయన్నారు. ముఖ్యంగా అంతరిక్ష, వైద్య రంగంలో సాధించిన పురోభివృద్ధి, స్వయం సమృద్ధి దేశాన్ని ప్రపంచంలో అగ్రభాగాన నిలుపుతోందన్నారు. అద్భుతమైన సవాళ్లకు సమాధానాలు చెబుతున్న అంకుర (స్టార్టప్) పరిశోధనా సంస్థలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. మెరుగైన పరిశోధనలకు హైదరాబాద్ ఐఐటీలో మౌలిక వసతులు ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ ఐఐటీలో అద్భుతాల ఆవిష్కరణ జరుగుతాయని భావిస్తున్నామన్నారు. ముఖ్యంగా క్వాంటంకంప్యూటింగ్, కమ్యూనికేషన్, క్వాంటంసెన్సింగ్, మెట్రాలజీ, క్వాంటంమెటీరియల్స్, డిజైన్ల రంగాలలో ఎంతో ప్రగతి సాధించామన్నారు. ఐఐటీ హైదరాబాద్ బోర్డు చైర్మన్ బీవీ.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్ ఏర్పాటైన 16ఏళ్లలో ఎన్నో మైలురాళ్లు అధిగమించామన్నారు. కొత్త తరం ఐఐటీగా ఆధునిక శాస్త్ర సాంకేతిక సవాళ్లను ఎదుర్కొనే పరిశోధనలను చేయడంలో ముందంజలో ఉన్నామన్నారు. ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ బీఎస్.మూర్తి మాట్లాడుతూ అనేక ప్రతిష్ఠాత్మక ఫ్లాగ్‌షిప్ పరిశోధనా భాగస్వామ్య ప్రాజెక్టులతో ఐఐటీహెచ్ విద్యార్థులు కలిసి పనిచేస్తున్నారన్నారు. ఐఐటీ హైదరాబాద్ రిసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌కు కేంద్ర శాస్త్రసాంకేతిక మంత్రిత్వశాఖ రూ.500 కోట్ల నిధులను కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ఐఐటీహెచ్ కేవలం సాంకేతిక పట్టభద్రులను ఉత్పత్తి చేయమే కాకుండా పరిశోధకులను తయారు చేయడంపై దృష్టి కేంద్రీకరించామన్నారు. అకాడమిక్స్ డీన్ ప్రొఫెసర్ భరత్‌భూషన్ పానిగ్రాహి, ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ వి.కాంచన, అడ్మిన్ డీన్ రంజిత్‌రామదురై, ఏసీఆర్ అడ్మిన్ డాక్టర్ ముద్రికాఖండేల్వాల్, ఎస్ఆర్‌సీ డీన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్‌శర్మకు ఎక్సలెన్సీ అవార్డులను అందజేశారు.



మాట్లాడుతున్న జాతీయ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం సెక్రెటరీ ప్రొఫెసర్ అభయ్ కరాండికర్

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

- హాజరైన మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

అల్లాదుర్గం, మార్చి 21: ఎంతో ప్రసిద్ధి చెందిన అల్లాదుర్గంలోని వేంకటేశ్వరాలయంలో నిర్వహిస్తున్న ధ్వజ స్తంభ ప్రతిష్ఠ రెండోరోజైన గురువారం కన్నుల పండువగా సాగింది. పురోహితులు శిలాంకోట ప్రవీణ్‌శర్మ ఆధ్వర్యంలో పలువురు అర్చకులు వేదమంత్రోశ్చరణలో ఉదయం నుంచే ఉత్సవాలు జరిపారు. ఆవాహిత దేవాతాపూజ, మూలమంత్ర హోమం, మహాస్నపనం, ధ్యాన్యాధివాసం, సుదర్శన హోమంతో పాటు శ్రీనివాస కల్యాణం నిర్వహించారు. ఈ వేడుకలోల అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, జహీరాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, స్థానిక ఎంపీపీ అనిల్ కుమార్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు.


వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న క్రాంతికిరణ్, గాలి అనిల్‌కుమార్


మండలంలో సాగవుతున్న మొక్కజొన్న

మొక్కజొన్నకు తెగుళ్ల బెడద

- రాత్రికి రాత్రే పంటను నాశనం చేస్తున్న కత్తెర పురుగు
- మందులు పిచికారీ చేసినా.. తగ్గని ఉధృతి

కోహెడ, మార్చి 21: యాసంగి(రబీ)లో మొక్కజొన్న సాగుచేసిన రైతులకు తెగుళ్ల బెడద పట్టుకున్నది. పంటకు కత్తెర పురుగు, లద్దె పురుగు సోకి పూర్తిగా దెబ్బతిస్తున్నాయి. రాత్రికిరాత్రే పంటను నాశనం చేస్తున్నాయి. రసాయన మందులు ఇప్పటికే రెండుసార్లు పిచికారీ చేసినా... ఫలితం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వానాకాలంలో పత్తి, వరి పంట వేసినా దిగుబడి రాలేదు. అలాగే నీటి కొరత ఉండడంతో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న ఎక్కువగా సాగుచేశారు..

పెరిగిన జొన్న సాగు

గతేడాది యాసంగి సీజన్‌తో పోలిస్తే ఈఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. మండల వ్యాప్తంగా 6 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేసినట్లు వ్యవసాయాధికారుల లెక్కలు చెబుతున్నాయి. ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయడంతో పాటు సులువుగా సాగుచేసే అవకాశం ఉండడంతో రైతులు సాగుచేసేందుకు ముందుకు వచ్చారు. కొంత పంట ఇప్పటికే రైతుల చేతికి వచ్చింది. మరికొంతమంది నీటి కొరత లభ్యం చూసుకుని ఆలస్యంగా మొక్కజొన్న పంటలు వేశారు. చేతికొచ్చే సమయంలో పంటలకు రోగాలు సోకి దెబ్బతింటున్నాయి. దిగుబడి సైతం ఎకరానికి దాదాపుగా 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు వస్తున్న. కానీ ప్రస్తుతం కత్తెర పురుగు, లద్దె పురుగు సోకడంతో దిగుబడిపై రైతులు ఆందోళన చెందుతున్నారు..

దిక్కుతోచని స్థితిలో రైతులు

జొన్న సాగుచేసిన రైతులను కత్తెర పురుగు, లద్దె పురుగుతో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. పురుగు ఉధృతి ఎక్కువగా ఉండడంతో రైతులు ఆశలు వదులు కోవాల్సిన వస్తోంది. రసాయన మందులు పిచికారీ చేసినా పురుగు ఉధృతి తగ్గడం లేదు. ఆకులను తింటూ రంధ్రాలు చేస్తున్నాయి. దీంతో పంటను ఎలా కాపాడుకోవాలని మొక్కజొన్న రైతులు ఆందోళన చెందుతున్నారు..

గుళికలు వాడాలి: భోగేశ్వర్, ఏవో, కోహెడ

ప్రస్తుతం కత్తెర, లద్దె పురుగు ఉధృతి అధికంగా ఉన్నది. పంట రక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు ఏఈవోల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. పురుగు ఉధృతి అరికట్టేందుకు తావుడు, బెల్లం, నూనెతో చేసిన గుళికలు వినియోగించాలి.

సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి

- కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి
- ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్


బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్

పుల్కల్, మార్చి 21: సబ్బండ వర్గాల సంక్షేమానికి ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో గురువారం ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జహీరాబాద్ పార్లమెంట్ సీటును నరేంద్రమోదీకి బహుమతిగా ఇవ్వాలని, ఇందుకు బూత్‌స్థాయి కార్యకర్తలే అత్యంత కీలకమన్నారు. పదేళ్లుగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమం కోసం పనిచేస్తున్నదన్నారు. తాను ఇటీవల బీజేపీలో చేరానని, మరోసారి ఎంపీగా ఆదరించి అవకాశం ఇవ్వాలని బీబీ పాటిల్ కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ప్రభాకర్‌గౌడ్, న్యాయవాది బస్వరాజ్ పాటిల్, బీజేపీ మండలాల అధ్యక్షులు ప్రవీణ్, పండరి, ప్రవీణ్‌రెడ్డి, రాకేశ్, సాయి, వెంకట్, శ్రీనివాస్, పుట్టి మోహన్, అనిల్, మహదేవ్ పాల్గొన్నారు. కాగా మండల కేంద్రమైన చౌటకూర్‌తో పాటుగా కోర్పోలు గ్రామాలకు చెందిన వంద మంది కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీబీ పాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రాజ్‌కుమార్, విఠల్‌రెడ్డి, పెద్దారెడ్డిపేటకు చెందిన రమేశ్‌బస్వరాజ్‌పాటిల్, చౌటకూర్ మాజీ సర్పంచ్ గొంగ్లూరు జనార్ధన్‌ముదిరాజ్, నాయకులు రియాజ్, సార అంజనేయులు బీజేపీలో చేరిన వారిలో ఉన్నారు.

కలిసికట్టుగా పనిచేద్దాం

జహీరాబాద్, మార్చి 21: బీజేపి గెలుపుకోసం అందరం కలిసికట్టుగా పనిచేద్దామని జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ పేర్కొన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన పదేళ్లలో జహీరాబాద్ పార్లమెంట్ అభివృద్ధికి తనవంతు బాధ్యతగా కృషిచేశానని గుర్తుచేశారు. దేశవ్యాప్తంగా నరేంద్రమోదీ హవా కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. బీజేపీలో చేరేందుకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఉత్సాహం చూపుతున్నారని పేర్కొన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ బూత్‌స్థాయిలో బీజేపీని మరింత పటిష్ఠవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. ఇదిలా ఉండగా జహీరాబాద్, మొగుడంపల్లి, న్యాల్‌కల్, కోహీర్ తదితర మండ లాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. సజ్జాపూర్ గోవర్ధన్‌రెడ్డి, దేశెట్టిపాటిల్, రంజోల్‌కు చెందిన సత్యం ముదిరాజ్ బృందం, క్రిష్టారెడ్డి, పలువురు లింగాయత్ సమాజ్ నాయకులు, అందోల్‌కు చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌గౌడ్, సుధీర్‌బండారీ, జిల్లా నాయకులు నౌబాద్ జగన్, నియోజకవర్గ నాయకులు జనార్ధన్‌రెడ్డి, మండలాధ్యక్షులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చీకటి రాజకీయాలు మానుకోవాలి: రఘునందన్‌రావు

హవేళిఘణపూర్/మాసాయిపేట, మార్చి 21: కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు చీకటి రాజకీయాలు మానుకోవాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పార్టీ బూత్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకరు బలమైన అభ్యర్థిని పెడితే, మరొక్కరు బలహీనమైన అభ్యర్థిని పెట్టేలా ప్లాన్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా మెదక్‌లో కాషాయజెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు కూచన్‌పల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 30 మంది కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు పంజా విజయ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్ రెడ్డి, రాష్ట్ర నాయకురాలు కరణం పరిణీత పాల్గొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎన్ని గేట్లు తెరిచినా ప్రజలు నో కాంగ్రెస్, నో బీఆర్ఎస్ అంటున్నారని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి ఎం.రఘునందన్‌రావు పేర్కొన్నారు. మాసాయిపేట మండలం కేంద్రంలో మెదక్ పార్లమెంటరీ స్థాయి ఉమ్మడి జిల్లా ఎమ్మార్పీఎస్ బీజేపీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని, బీఆర్ఎస్ కనుమరుగవుతున్నదని చెప్పారు.


హవేళిఘణపూర్: సమావేశంలో మాట్లాడుతున్న రఘునందన్‌రావు

కూలీల సంఖ్య పెంచాలి

● డీఆర్డీవో పీడీ జయదేవ్



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీవో పీడీ జయదేవ్

జగదేవ్‌పూర్, మార్చి 21: ఉపాధి హామీ పనిలో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్డీవో పీడీ జయదేవ్ పేర్కొన్నారు. గురువారం జగదేవ్‌పూర్ మండలంలోని వివిధ గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, మండల అధికారులతో ఉపాధిహామీ పనులపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూలీలకు వందరోజుల ఉపాధి కల్పించేలా అధికారులు కృషి చేయాలని అన్నారు. ఉపాధి పనుల వద్ద కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉపాధి పనుల్లో అధికారుల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. త్వరలో కూలీలకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి, ఎంపీవో శ్రీనివాస్‌వర్మ, ఏపీవో లక్ష్మి, టెక్నిక్ అసిస్టెంట్‌లు కరుణాకర్‌రెడ్డి, రాజు, తిరుపతిరెడ్డి, నరేశ్, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

అవస్థల్లో పాలిటెక్నిక్ గురుకుల కళాశాల

● వర్షం వస్తే హాస్టల్ గదులు జలమయం

● ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్

గజ్వేల్, మార్చి 21: ఆదర్శంగా ఉండాల్సిన జీఎంఆర్ పాలిటెక్నిక్ గురుకుల కళాశాల అధ్వానంగా తయారయింది. టెక్నికల్ విద్యా ప్రమాణాల్లో జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలకు రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు మూలమైన గురుకుల పాలిటెక్నిక్ కళాశాల నేడు అధ్వాన పరిస్థితికి చేరుకున్నది. సదరు కళాశాల స్థలంలోనే సువిశాలమైన బాలుర ఎడ్యుకేషన్ హబ్ అందుబాటులోకి రావడంతో పాలిటెక్నిక్ కళాశాల రూపే మారిపోయింది. 40ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన స్థలాల్లో పీజీ, డిగ్రీ, ఇంటర్మీడియేట్, ఉన్నత పాఠశాలలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ హాస్టళ్లను గత ప్రభుత్వం నిర్మించింది. కళాశాలకు చెందిన స్థలాలను లాక్కున్న ప్రభుత్వం కళాశాలకు హాస్టల్ భవనాన్ని కట్టించేందుకు మాత్రం అసక్తి చూపలేదు.

శిథిలావస్థకు చేరిన భవనం

కళాశాలకు చెందిన హాస్టల్ భవనం మొత్తం ఆరు బ్లాకులు, 75 గదులల్లో 320 మంది విద్యార్థులుండేందుకు వీలుగా 30ఏళ్ల క్రితం నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరడంతో వర్షాకాలంలో వర్షం వస్తే గదుల్లోకి, హాస్టల్‌లోకి నీరు వచ్చిచేరుతుంది. చుట్టూ ఖాళీ స్థలం ఉండడంతో పాములు, ఎలుకలు వస్తున్నాయి. హాస్టల్‌కు అనుసంధానంగా ఉన్న మరుగుదొడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారయింది. మరుగుదొడ్లు సరిగా లేకపోవడంతో ఆరుబయటనే విద్యార్థులు స్నానాలు చేస్తున్నారు. హాస్టల్ భవనం నెర్రలు బారడంతో విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు.



పగుళ్లు వచ్చిన హాస్టల్ భవనం



శిథిలావస్థకు చేరుకున్న హాస్టల్

పక్కన గొప్పగా.. ఇక్కడేమో ఇలా..

పక్కన చూస్తే ఎడ్యుకేషన్ హబ్ భవనాలు ఎంతో ఆహ్లాదంగా, ఆధునిక హంగులతో, ఆధునిక సదుపాయాలతో అందుబాటులోకి వస్తే, ఎడ్యుకేషన్ హబ్ నిర్మించేందుకు స్థలాన్ని ఇచ్చిన పాలిటెక్నిక్ కళాశాలకు మాత్రం శిక్ష వేసినట్లుగా అయింది. తమకు ఒక నూతన భవనాన్ని కట్టిస్తే బాగుంటుందని, లేదా తాత్కాలికంగా ఎడ్యుకేషన్ హబ్‌లో తమకు హాస్టల్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తప్పుతాయని విద్యార్థులు, సిబ్బంది కోరుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు

గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన భవనాన్ని నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా బాగు చేస్తుందని విద్యార్థులు ఆశపడుతున్నారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గి పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేశారు. 40ఏళ్ల చరిత్ర కలిగిన జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజనీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని విద్యార్థులు, విద్యార్థి సంఘాల నుంచి డిమాండ్‌లు మొదలయ్యాయి.

సుందరంగా ప్రయాణ ప్రాంగణం

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మద్దూరు, మార్చి 21: మండలంలోని నర్సాయపల్లి గ్రామంలోని ప్రయాణ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఎలాంటి వాల్‌పోస్టర్లు అంటించరాదంటూ వాల్ రైటింగ్ ద్వారా హెచ్చరించారు. ఈ నెల 3న ఆంధ్రజ్యోతిలో 'బస్టాండ్ ముందు పోసిన ఇసుక, కంకరను తొలగించాలంటూ' ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. ప్రయాణ ప్రాంగణం ముందు ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి ప్రయాణ ప్రాంగణం ముందు ఇసుక, కంకర పోశారు, పలుమార్లు తీసేయాలని సూచించినా బెదిరింపులకు పాల్పడుతున్నాడని పత్రికా ముఖంగా వార్త ప్రచురితం కావడంతో గ్రామపంచాయతీ అధికారులు ఇసుక, కంకర తొలగించి శుభ్రం చేసి బస్టాండ్‌కు సున్నం వేసి సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో బస్టాండ్ వినియోగంలోకి రావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆంజనేయులు మృతదేహం

రాయపోల్, మార్చి 21: ఉరేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం అనాజీపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. మృతుని కుమారుడి కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి.. గ్రామాని చెందిన మంగలి ఆంజనేయులు(55) గ్రామంలో విద్యుత్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. అతడు మద్యానికి బానిసై తరచూ మద్యం తాగి ఇంటికి వస్తుండడంతో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. బుధవారం కుటుంబసభ్యులందరూ ఓ శుభకార్యానికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చే సరికి ఆంజనేయులు కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం ఊరు చివరన ఓ చెట్టుకు ఉరేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుని కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రఘుపతి తెలిపారు.

చెరువులో స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి



స్వామి మృతదేహం

ములుగు, మార్చి 21: మద్యం మత్తులో చెరువులో స్నానానికి వెళ్ళి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని తున్కిబొల్లారం గ్రామంలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పర్వతం స్వామి(35) చిత్తు కాగితాలు ఏరుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రోజు మాదిరిగానే కాగితాలు అమ్ముకుని మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. ఐదున్నర గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. అక్కడి నుంచి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ మామిడాల పరిధిలో ఉన్న చెరువులో స్నానం చేయడానికి స్వామి దిగినట్లు తెలిసింది. ఎంతకీ బయటకు రాకపోవడంతో ఓ వ్యక్తి అతడి కుటుంబసభ్యులకు సమాచారం అందించాడు. బుధవారం రాత్రి వరకు చెరువులో వెతికినా మృతదేహం లభిచలేదు. గురువారం ఉదయం పదిన్నర గంటలకు చెరువు నుంచి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ముగ్గురు పిల్లలున్నారు. భార్య కొండవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

పుట్టుకతోనే ఎవరూ నేరస్థులు కారు

● హుస్నాబాద్ కోర్టు జడ్జి శివరంజని



మాట్లాడుతున్న జడ్జి శివరంజని

బెజ్జంకి, మార్చి 21 : పుట్టుకతోనే ఎవరు నేరస్థులు కారని, చేసే చట్ట వ్యతిరేక పనుల వల్ల నేరసు అవుతున్నారని హుస్నాబాద్ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శివరంజని అన్నారు. మండలంలోని దాచారం గ్రామంలో గురువారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. స్త్రీ శక్తి గురించి వర్ణించడానికి మాటలు చాలావని, సమాజంలోని లోపాల కారణంగానే నేరాలు జరుగుతున్నాయని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల మనస్తత్వాలను అర్థం చేసుకుని వారి హావభావాలను గమనించాలని పేర్కొన్నారు. హుస్నాబాద్‌లో డ్రగ్ కేసులు ఎక్కువ అవుతున్నాయని, మత్తు పదార్థాలకు బానిసలవ్వడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఎన్ని సమస్యలు ఉన్నా కూర్చుని మాట్లాడుకుంటే పరిష్కారమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కవిత, ఎంపీటీసీ కొలిపాక రాజు, హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, ప్రధాన కార్యదర్శి జులాల్ నాయక్, ఏజీపీ రామకృష్ణ, న్యాయవాదులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటా

● ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 21 : బీఆర్‌ఎస్ పాలనలో రైతాంగాన్ని కంటికి రెప్పలా కాపాడుకున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా వదిలేసిందని, నియోజకవర్గ రైతాంగానికి తాను అండగా ఉంటానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. రంగనాయకసాగర్ కాలువ ద్వారా ఇటీవల విడుదల చేసిన నీటి ద్వారా చేర్యాల మండలం దానంపల్లి గ్రామంలోని చెరువు నిండింది. ఈ సందర్భంగా గురువారం చెరువును సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగానికి సాగునీరు ఇవ్వడంలో విఫలమవడంతో పంటలు ఎండిపోతున్నాయని, రైతులు ఆందోళన చెందుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. అనంతరం గ్రామంలోని దానంపల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వసతుల కల్పన, విద్యాబోధనపై ఆరాతీశారు. ఆయా కార్యక్రమాలలో ఎంపీపీ వుల్లంపల్లి కరుణాకర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అనంతుల మల్లేశం, నాయకులు సుంకరి మల్లేశం, జింకల పర్వతాలు, అరిగె కనకయ్య, మహిపాల్‌రెడ్డి, నర్ర ఉపేందర్‌రెడ్డి, జంబియా రాజు పాల్గొన్నారు.



రేబర్తిలో పెద్దమ్మతల్లిని దర్శించుకుని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

పెద్దమ్మతల్లి ఆశీస్సులుండాలి

మద్దూరు, మార్చి 21 : మండలంలోని రేబర్తి గ్రామంలో ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పెద్దమ్మతల్లి కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మతల్లి ఆశీస్సులు గ్రామస్తులందరిపై ఉండాలని మొక్కుకున్నానన్నారు. ఆయనవెంట ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ మలిపెద్ది సుమలతామల్లేశం, మద్దూరు, దూళిమిట్ట మండల పార్టీ అధ్యక్షులు మేక సంతోష్‌కుమార్, మంద యాదగిరి, తదితరులు ఉన్నారు.

ఆకుకూరలు రక్తహీనతను నివారిస్తాయి

● గజ్వేల్ ఐసీడీఎస్ సీడీపీవో సరిత

రాయపోల్, మార్చి 21: బాలికల్లో రక్తహీనత లోపాన్ని నివారించడానికి ఆకుకూరలు, ఐరన్ చాలా ఉపయోగపడతాయని గజ్వేల్ ఐసీడీఎస్ సీడీపీవో సరిత పేర్కొన్నారు. మండలస్థాయి పోషణ మహోత్సవాలు గురువారం రాయపోల్ రైతు వేదికలో జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గజ్వేల్ ఐసీడీఎస్ సీడీపీవో సరిత సంప్రదాయ, ప్రాంతీయ, స్థానిక ఆహార పద్ధతులు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ షబానా, ఎస్‌ఐ రఘుపతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

రేపటి తరానికి సరైన పోషణతోనే ఆరోగ్యం

మిరుదొడ్డి, మార్చి 21: రేపటి తరానికి సరైన పోషణ ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించగలుగుతామని ఐసీడీఎస్ బ్లాక్ కో ఆర్డినేటర్ శ్యాంసన్ అన్నారు. గురువారం మిరుదొడ్డి మండలం చెప్యాల గ్రామంలోని రెండో సెక్టర్‌లో పోషణ పక్షం అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన చిరుధాన్యాల ప్రాధాన్యతను వివరించారు. ఆచరణ పోషకహార సూచికలను మెరుగుపరచడంతో పా టు అవగాహన కల్పించడమే ధ్యేయంగా కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో సెక్టర్ సూపర్‌వైజర్ రేణుకా, చంద్రప్రకాష్ ఉన్నారు.



రాయపోల్‌లో మాట్లాడుతున్న సీడీపీవో సరిత

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తున్న యంత్రాలు

● పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్, మార్చి 21: రైతులు వరి ధాన్యాన్ని పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలల్లోని జల్లి యంత్రంతో తూర్పారా పడతారు. ధాన్యం కొనుగోళ్లు ముగిసి 6 నెలలు గడుస్తున్నా మండల పరిధిలోని గాజులపల్లి, ఇందుప్రియల్, శేరిపల్లి బందారం, తదితర గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల వద్ద జల్లి పట్టే యాంత్రాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ దర్శనమిస్తున్నాయి. సంబంధిత అధికారులు యంత్రాలను భద్ర పరచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు, రైతులు ఆరోపిస్తున్నారు.



దౌల్తాబాద్‌లోని ఇందుప్రియల్‌లో ఎండకు ఎండుతున్న జల్లి యంత్రం

వీధి కుక్కల దాడిలో వృద్ధురాలికి గాయాలు

ములుగు, మార్చి 21: వీధి కుక్కల దాడిలో వృద్ధురాలు గాయపడింది. ఈ సంఘటన ములుగు మండలం మామిడాల గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామంలోని ఆలయం వద్ద జరుగుతున్న పనులు చూసేందుకు బబ్బూరి లక్ష్మి (70) మరో మహిళతో కలిసి వెళ్లింది. అక్కడున్న ఐదారు కుక్కలు ఆమెపై దాడి చేశాయి. ఈ దాడిలో ఆమె చెయ్యికి తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను వెంటనే కుటుంబసభ్యులు ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ కుక్క కాటుకు సంబంధించిన మందులు లేకపోవడంతో సాధారణ టీకాను ఇచ్చి గజ్వేల్ ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ సలహా ఇచ్చారు. గజ్వేల్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ టీకా ఇచ్చారని కుటుంబసభ్యులు తెలిపారు.

ప్రేమికుడి ఇంటి ఎదుట ప్రియురాలి ధర్నా

సిద్దిపేట క్రైం, మార్చి 21: ప్రేమించి మోసం చేశాడని ప్రియుడి ఇంటి ఎదుట ప్రియురాలు ధర్నాకు దిగింది. తనను ప్రేమించి ఒక బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత మోసం చేశాడని సిద్దిపేట మండలం ఇమాంబాద్ గ్రామానికి చెందిన అంబిగల్ల స్వాతి అదే గ్రామానికి చెందిన తన ప్రియుడు గొడుగు గణేష్ ఇంటి ఎదుట గురువారం ధర్నాకు దిగింది. స్థానికుల వివరాల ప్రకారం .. గొడుగు గణేష్, అంబిగల్ల స్వాతి చాలా కాలంగా ప్రేమలో ఉన్నారు గణేష్ అమ్మాయిని శారీరకంగా వాడుకుని గర్భవతిని చేసి సంబంధం లేదని చెప్పడంతో బాధితురాలు కుటుంబ సభ్యులతో కలిసి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విషయం కోర్టులో ఉండగానే నిందితుడు తండ్రి అయ్యాడు. ఒక ఆడ శిశువుకు జన్మనిచ్చారు. డీఎన్‌ఏ టెస్టులు అన్నీ పూర్తి అయిన తర్వాత ఆ శిశువుకు తండ్రి అతనే అని రుజువు అయింది. ఇప్పుడు వివాహం చేసుకొమ్మని అంటే ఇబ్బంది పెడుతున్నారని, తన శిశువుకు తనకు ఆధారం చూపించాలని బాధితురాలు నిందితుడి ఇంటి ఎదుట బైఠాయించింది. పోలీసులు జోక్యం చేసుకుని పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలని గత వారం పంపించారు. పెద్దలు దీనిపై స్పందించకపోవడంతో తిరిగి మహిళా సంఘాల సహకారంతో కుటుంబ సభ్యులతో కలిసి బాధితురాలు ప్రేమికుడి ఇంటి ఎదుట ధర్నాకు దిగింది.

మురుగు కుంటగా మారిన గుడికుంట

జగదేవ్‌పూర్, మార్చి 21: మండలం పరిధిలోని తిగుల్ గ్రామంలో కొన్ని దశాబ్దాలుగా ఎస్సీ, బీసీల ఇళ్ల మధ్య గుడి కుంట ఉంది. గతంలో ఈ కుంట పశువుల దాహం తీర్చేదిగా ఉండేది. వర్షం నీటితో నిండి కుంట ఎప్పుడూ నిండుగా ఉండేది. రానురాను ఈ కుంట మురికి కూపంగా మారింది. పక్కన ఇళ్లల్లోని మురుగునీరంతా కుంటలో చేరడం, అలాగే చెత్తాచెదారం నిండడం వల్ల ప్రస్తుతం కుంట అధ్వానంగా తయారు అయింది. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల మధ్య ఉన్న పాత బావులను పూడ్చి, శిథిలావస్థకు చేరిన ఇళ్లను నేలమట్టం చేశారు. ఆ సమయంలో అధికారులు మురుగు కుంటను పూడ్చేందుకు చర్యలు తీసుకోకపోవడం వల్ల మురుగుకుంట అలాగే ఉంది. గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ వెంకట్రాంరెడ్డి కుంట పూడ్చి వేసి కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని ఆదేశించినా అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య వారోత్సవాలను నిర్వహించింది. ఆ సమయంలో గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టిన కుంట వద్ద మాత్రం పనులు చేయలేదు. అధికారులు స్పందించి మురుగు కుంటను పూడ్చివేయాలని కోరుతున్నారు. కొంత మంది కుంట ఖాళీ స్థలంలో మట్టి పోసి ఆక్రమించుకుంటున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సందంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కాగా గురువారం గుడికుంటను పీఏసీఎస్ డైరెక్టర్ కామల్ల భూమయ్య పరిశీలించారు. కుంటను పూడ్చివేయాలని ఎంపీడీవోను కోరారు.



గుడికుంటను పరిశీలిస్తున్న పీఏసీఎస్ డైరెక్టర్ కాలమల్ల భూమయ్య

కాంగ్రెస్‌లో చేరికలు

సిద్దిపేట టౌన్, మార్చి 21: సిద్దిపేట పట్టణంలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో గుర్రాలగొంది గ్రామానికి చెందిన వారు బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయిని నర్సింహారెడ్డి, కిసాన్ కాంగ్రెస్ స్టేట్ కన్వీనర్, మాజీ సర్పంచ్ మట్ట నర్సయ్య, నాయకులు మంద పాండు, రామస్వామి, యాదగిరి, వెంకట్‌రెడ్డి, బెజగం శ్రీలత, బక్క దుర్గవ్వ, జంగం మనవ్వ తదితరులు పాల్గొన్నారు.

గుళికలు కలిపిన కుడితి తాగి రెండు పాడి గేదెలు మృతి

అక్కన్నపేట, మార్చి 21: కుడితి నీటిలో గుర్తుతెలియని వ్యక్తులు గుళికలు కలపడంతో ఆ కుడితి తాగిన రెండు పాడి గేదెలు మృతి చెందాయి. ఈ సంఘటన గురువారం అక్కన్నపేట మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. అక్కన్నపేట మండల కేంద్రానికి చెందిన మట్టెల కనకయ్య మూడు పాడి గేదెలతో పాల ఉత్పత్తి చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున పాలు పితికి ఇంటికి వచ్చి మరల ఉదయం గేదెలకు కుడితి నీరు అందించేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అక్కడే కుడిది నీరు ఉంచి వచ్చాడు. నీరు తాగిన పాడి గేదెలు నోటి నుంచి రక్తం కక్కుతూ కనిపించడంతో హుటాహుటిన పశు వైద్యులకు సమాచారం అందించడంతో వారు వచ్చి చికిత్స అందిస్తుండగా రెండు పాడిగేదెలు మృతి చెందాయి. ఈ సంఘటనపై రైతు కనకయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, కేసు నమెదు చేసుకోని దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపారు.

'భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

సిద్దిపేట అర్బన్, మార్చి 21 : సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని సర్వేనెంబర్ 21లో ఉన్న ప్రభుత్వ భూమిని పొన్నాలకు చెందిన ఓ నాయకుడు కబ్జా చేశాడని, దీనికి అప్పటి ఓ అధికారి సహకరించాడని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆరోపించారు. గురువారం పొన్నాలలో స్థలాన్ని పరిశీలించి అనంతరం అత్తు ఇమామ్ మాట్లాడుతూ.. 21 సర్వే నెంబర్‌లో సుమారు 18 గుంటల భూమిని కబ్జా చేసినట్లు ఆరోపించారు. కబ్జాకు గురైన స్థలంలో ప్లాట్స్ చేసి అమ్ముకున్నారని, బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అధికారి చూస్తూ ఉండిపోయాడని అన్నారు. భూ కబ్జా వ్యవహారంలో సంబంధిత అధికారిపై, నాయకుడిపై పూర్తిస్థాయి విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ యువజన అధ్యక్షుడు గౌయాజ్ ఉద్దీన్, నాయకులు మహేష్, ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

హెర్బల్ లైఫ్ న్యూట్రిషన్ కిట్ పేరిట మోసం

సిద్దిపేట క్రైం, మార్చి 21 : సిద్దిపేటలో గొలుసు కట్టు స్కీమ్‌తో హెర్బల్ లైఫ్ న్యూట్రిషన్ కిట్ పేరు మీద మోసం వెలుగులోకి వచ్చింది. రాజు, మాధవన్ పట్టణంలోని భారత్‌నగర్‌లో హెర్బల్ లైఫ్ న్యూట్రిషన్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన స్వప్న అనే మహిళ నుంచి న్యూట్రిషన్ క్లబ్ ఏర్పాటు చేపిస్తామని చెప్పి రూ.5 లక్షలు తీసుకున్నట్లు ఆమె భర్త రాజిరెడ్డి ఆరోపించారు. న్యూట్రిషన్ క్లబ్ ఏర్పాటు కాకపోవడంతో స్వప్న ఆత్మహత్యాయత్నం చేసినట్లు రాజిరెడ్డి పేర్కొన్నారు. తన భార్య రాసిన సూసైడ్ నోట్ లభించడంతో మోసం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్వాకులపై రాజిరెడ్డి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యాదవ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

దుబ్బాక, మార్చి21: యాదవ కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం ప్రకటిస్తూ, గురువారం కాంగ్రెస్ పార్టీ దుబ్బాక మండల యువత కార్యదర్శి వినాయకుమార్ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు శాలువను కప్పి, పూలబుకేను అందజేశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

కొండపాక, మార్చి 21 : ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ప్రీతంను కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ గురువారం హైదరాబాదులో కలిసి శుభాకాంక్షలు తెలిపాడు. ఆయన వెంట బాబు వీరేశం ఎల్లన్న భాను తదితరులు ఉన్నారు.

యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రమేష్ యాదవ్

ములుగు, మార్చి 21: అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ములుగు మండలం బైలంపూర్ గ్రామానికి చెందిన పల్లె రమేష్‌యాదవ్‌ను నియమించారు. గురువారం రాష్ట్రమహసభల అధ్యక్షుడు వెంకటేశ్వర్ యాదవ్ చేతుల మీదుగా రమేష్ యాదవ్ నియమాకపత్రం అందుకున్నారు.

బీజేపీ మండల అధికార ప్రతినిధిగా సాయికిరణ్

చిన్నకోడూరు, మార్చి 21 :బీజేపీ మండల అధికార ప్రతినిధిగా ఏనుగుల సాయికిరణ్ నియామకమయ్యారు. ఈ మేరకు గురువారం సిద్దిపేట పట్టణంలో బీజేపీ మండలాధ్యక్షుడు సూరగోని శేఖర్‌గౌడ్ నియామక పత్రం అందజేశారు.

హుస్నాబాద్ డిపోలో ప్రగతి చక్ర అవార్డుల వేడుక

హుస్నాబాద్ టౌన్, మార్చి 21 : హుస్నాబాద్ ఆర్టీసీ డిపోలో గురువారం ప్రగతి చక్ర అవార్డుల వేడుకలను నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు నగదు ప్రోత్సహకాలను అందజేశారు. కార్యక్రమంలో డిపో సూపరింటెండెంట్ శ్రీధర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బస్టాండ్ ఆధునీకరణ పనులు షురూ

హుస్నాబాద్, మార్చి 21: హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆధునీకరణ పనులు ప్రారంభమయ్యాయి. దాదాపు రూ. 2కోట్లతో ఈ పనులు చేస్తున్నారు. ఈ నెల 8వ తేదీన రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేయగా గురువారం నుంచి పనులను ప్రారంభించారు. పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

చిన్నకోడూరు, మార్చి 21: అకాల వర్షానికి దెబ్బతిన్న పంటల నష్టాన్ని ప్రభుత్వం అంచనా వేయించి రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు భైరారెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని ఇబ్రహీంనగర్ గ్రామంలో అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను గురువారం రైతు సంఘాల సమాఖ్య నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి పంటకు ఎకరాకు రూ. 20 వేలు, కూరగాయాల పంటలకు రూ. 10 వేల చొప్పున రైతులకు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి మహేందర్, రైతులు పాల్గొన్నారు.

'పెండింగ్ కూలీని వెంటనే చెల్లించాలి'

అక్బర్‌పేట-భూంపల్లి, మార్చి21: ఉపాధి హామీలో రెండునెలలుగా పెండింగ్‌లో ఉన్న కూలీని ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని బీడీఎఫ్ జిల్లా ఉపాధ్యాక్షుడు భీమ్‌శేఖర్ డిమాండ్ చేశారు. ఆయన గురువారం అక్బర్‌పేట- భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో ఉపాధి హామీ హక్కుదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న చోట కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. చేశారు. ఉపాధి హామీ పనుల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకేట్లను, ప్రథమ చికిత్స బాక్స్‌లను ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ హక్కుదారులకు 200 రోజులు పని కల్పించాలని భీమ్‌శేఖర్ డిమాండ్ చేశారు.

అన్ని స్థానాలను ఓసీలకే కేటాయించారు

● బీసీ జనభేరీ రాష్ట్రకన్వీనర్ అబ్బుల రాజలింగంగౌడ్

దుబ్బాక, మార్చి 21: జిల్లాలోని మార్కెట్ కమిటీల రిజర్వేషన్ కేటాయింపులో అన్ని స్థానాలను ఓసీలకే కేటాయించారని, కేటాయింపులు ఏలా ఉన్నా, నియామకంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని తెలంగాణ బీసీ జనభేరీ రాష్ట్రకన్వీనర్, మాజీ జడ్పీటీసీ అబ్బుల రాజలింగంగౌడ్ హెచ్చరించారు. గురువారం ఆయన దుబ్బాకలో విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో ఇద్దరు బీసీ మంత్రులు ఉన్నారని, తెలంగాణ ఉద్యమం కన్నా, బీసీ హక్కుల కోసం పోరాటం చేశారన్న పేరున్న పొన్నం ప్రభాకర్‌గౌడ్ దీనిపై ఆలోచించాలన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన పోలీసులు

చేర్యాల, మార్చి 21 : పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని గురువారం చేర్యాల పోలీసులు సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీను మాట్లాడుతూ.. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణకు తాము పాటుపడుతున్నామని, ప్రతి ఒక్కరూ పోలింగ్‌లో పాల్గొని ఓటుహక్కును వినియోగించుకోవాలని, అందుకు తగిన భద్రత కల్పిస్తామన్నారు. ఆయనవెంట ఎస్‌ఐ దామోదర్ ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి అద్దె భవనమే దిక్కు

● దూళిమిట్ట మండలం ఏర్పాటుతోనే సరి

● ఏళ్లు గడుస్తున్నా సొంత భవనం లేక అవస్థలు

దూళిమిట్ట, మార్చి 21: దూళిమిట్ట మండలంగా ఏర్పాటైనా తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో అసౌకర్యాల నడుమ పాలన కొనసాగుతున్నది. ఉమ్మడి మద్దూర్ మండలం నుంచి దూళిమిట్ట కేంద్రంగా 11 గ్రామాలతో మండలం ఏర్పాటు కావడంతో తహసీల్దార్ కార్యాలయం అందుబాటులోకి వచ్చింది.

అసౌకర్యాల నడుమ

దూళిమిట్ట తహసీల్దార్ కార్యాలయం గ్రామంలోని ఓ ఇంట్లో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. గ్రామం మధ్యలో ఏర్పాటు చేయడం వల్ల ఇతర గ్రామాల ప్రజలకు, ఆయా శాఖల అధికారులకు కూడా అసౌకర్యంగానే ఉంది. ప్రతి నెల అద్దె, విద్యుత్ బిల్లులు చెల్లించకపోవడంతో ఇంటి యజమాని ఖాళీ చేయమని అధికారులను అడుగుతన్నాడు.

హాస్టల్ భవనంలోకి మార్చితే ప్రయోజనం

మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై చౌరస్తాకు దగ్గరలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఎస్సీ హాస్టల్ భవనంలోనికి తహసీల్దార్ కార్యాలయాన్ని మార్చితే అందరికీ అందుబాటులో ఉండటంతో పాటు ప్రభుత్వానికి అద్దె భారం తప్పుతుంది. ప్రభుత్వం స్పందించి తహసీల్దార్ కార్యాలయానికి సొంత భవనం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



తహసీల్దార్ కార్యాలయం

సమీకృత కార్యాలయాల భవనం నిర్మించాలి



దూళిమిట్ట మండలంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట కొనసాగేలా సమీకృత కార్యాలయాల భవనం నిర్మిస్తే మండల ప్రజలందరికీ సౌకర్యంగా ఉంటుంది. అధికార యంత్రాంగం అందుబాటులో ఉండటంతో మండల ప్రజలకు సమయం ఆదా అవుతుంది.

- ఆలేటి లక్ష్మారెడ్డి, రైతు